# కొండాయిపక్షి

గొడ్డూ గోదా, గెడ్డీ, నీలు, పిడకా, బొడకా, అంటా సెంబూ, గుడ్డా గోసీ యిట్టాటి కాసిని కూసిని పన్లు సురుగ్గా ఎల్లి పోను, పన్నెండేళ్ళ కొండాయిని సవగ్గా జీతానికి పెట్టుకుండాడు కనకయగారు.

"అక్కడున్నావ్రట్రా కొండాయి పక్షి?" అని మామూలు పెకారం లోన పొయికాడుండ కనకయగారి పెల్లాం మాలచ్చుమ్మగారు కేకేసింది.

ఆడీడ యాడుండా వుంటాడు గనక యిట్టాంటి కేకలు అప్పుడప్పుడు కాత్తె పెడగా పోతావుంటయి కొండాయికి.

అయితే లోన పొయికాడ పొగలో ఎప్పుడు కాత్తె కొరబోతా వుండా కొండాయి సొయిట్టోవుండ బోసానంలో కూకుండాడేదో అనిపిత్తా వుంటది మాలచ్చుమ్మగారికి.

"ఎక్కడ్రా నువు కొండాయి పక్షి - ఇదేమిటి పలకడేం - " ఎంటనే అనుమానం దగిలిన మద్చుయి, గబిక్కన బోసానం కాడికొచ్చి - నిల్బడిపోయింది మాలచ్చుమ్మగారు. శాస ఎగబీలుత్తా.

"అయ్యో అయ్యో కొంపమునిగింది! మూల నక్కుతావేం, రా బయిటికీ? వీడి మొహంమండా. నాకు తెలుసు ఎప్పుడో యీ పక్షి కొంపగుండాన పెడ్తాడని! దొంగ పక్షీ రావేం బయిటికీ?"

"యిహిఁ యిహిఁ వూరకనే కూకండానండీ-" అంటా కాత్తె బోసానం యివకాడికొచ్చి నిలబడ్డాడు కొండాయి.

"వూరికే కూచున్నా! మొహాన నిప్పుపెడ్తా దొంగపక్షి దొంగపక్షని! యింకా వెనక దాచుకుంటున్నా, బయిటికి తీయవేం ఆ చేతుల్లోదీ?"

"బొమ్మలుంటే - సూత్తా ఆడ మూలకూకుంటేనీ-"

"భోషాణమ్మూల నక్కుతూ బొమ్మలేవిఁట్రా, నీ చూపు మండిపోనూ? తియవేం చేతుల్లోదీ?"

"పుత్తకవండీ."

"పుస్తకం! పుస్తకమేవిటీ! భోషాణం దగ్గిర నీకు పుస్తకాలెక్కడివిరా

దొంగచచ్చినోడా? నిజం చెప్పు చీలుస్తా."

"ఏనిగలూ, పచ్చులూ వుంటేనీ-?"

"అయ్యో వీడి సూద్రమొహం మండా! రాధాయి పుస్తకం మంట పెడ్తున్నాడు నే నేంజేతునూ-పెట్టవేం అక్కడా? మీ మొహాలకు చదువా చట్టుబండలా."

"ఏందండోయ్, నే అచ్చిరాలు సెప్పించుకోలా?"

"ఛీ నోరుముయ్, భోషాణం దగ్గిర తారట్లాడ్తూ. ఇంకా నయం కాస్త తాళమన్నా దాని మొహాన పెట్టారు. బహు వున్నయి యిట్టాంటి తెలవులు మటుకు, వుల్లిత్తుకుమల్లే బయట బడాయిలు కొట్టకపోతే కాస్త యింటో ఏవఁన్నా మంట పెట్టకూడదూ? అస లెందుకులే - మొహం మండా అట్లా చూస్తావేం చూపూ? చేతులు విరుస్తా రాధాయి పుస్తకాలజోలికి పోయినావంటే. ఇక్కడికి చాలక ఈ సూద్రసన్నాసి ముద్దుకూడా నాకూ! పుస్తకాలుట్రా నీ మొహానికీ? పదపద, ముచ్చు మొహం నువూనూ, అసలెట్లా వెయ్యికళ్ళతో కనిబెట్టుకు చస్తున్నా బతకలేకుండా వుంటేనూ!"

"మా జేజి నే సదువుకుంటే యిస్కోల్లో ఏపిత్తానందిగా. మా అయ్య లేకుంటేనా."

"వూఁ వొచ్చి సస్తుంది మొహాలకు. ముసల్ది పేడా పెంటా పోగేసి కూడ పెడ్తున్నది గావాఁలూ? ఏ యిస్కోల్లోరా నీకు చదువు చెప్పేదీ?"

"మొదులు అయ్య చెప్పుకోనిత్తేగా, ఆ మద్దినేవోఁ ఎంకట్రత్తంగోరు అచ్చిరాలు సెబతా వుండాడూ"

"ఎవరు ఆ మాలముతా ముండాకొడుకా! ఎవరు వాడేనా? అట్లా మిటకరించి చూస్తావేం గుడ్లు పొడిచేవాళ్లు లేకా. అసలు నీకు నేను చెప్పిందేమిటీ నువ్వు చేస్తున్న దేమిటీ? పొద్దూకులూ భోషాణం దగ్గిర చస్తావేం? అంట్లుచచ్చా? బఱ్ఱెను కడిగిచచ్చా? పిడికలుచచ్చా, చచ్చా?... ..."

ఆ రేత్తిరి బువ్వల్దిని పొందుకునేయాల, కొండాయి తడువుకుంటూ సల్లగా వొచ్చి ఎంకట్రత్తఁయ్య ఇంటి తలుపు తట్టాడు.

"ఎవరూ?" అంటా ఎంకట్రత్తవఁయ్య తలుపు దెరిశాడు.

"కొండాయిని."

"ఓరీ, నువ్వా! రా లోపలికి, ఇంత రాత్రొచ్చావేంరా?"

"ఏవిండోవ్-"

అదేమిట్రా అక్కడే నుంచున్నావ్? దా, యిటొచ్చి చాపమీద కూచో.'

"నీమడ్చి బంగారంగానూ ఎప్పుడొచ్చావియ్యా గుంటూర్నించీ? బలే ఆయనవియ్యా నువు, అగుపియకుండా బొయ్యావుగాని?"

"ఎవరు చెప్పార్రా నే నొచ్చాననీ?"

"అంతేనా? మా జేజికి తెల్చిందంటా, సెప్పిందీ, ఆమయిన లగెత్తుకొచ్చా."

"ఇంత చీకట్లో వొచ్చావు, ఏం తెల్లవారి రాకపోయినా? మీ జేజి అంతా బాగున్నారా?"

"వుండారుగానీ-యిదుగో - నాకు సదువు సెప్పవంటయ్యా?"

"ఏవిఁటా హడావుడీ!"

"అచ్చిరాలు సెబతావుంటివీ ఆమయిన యాడికో లగెత్తుకెల్తివీ."

"అవును నిజమేరా. యీసారి అట్లా లగెత్తన్లే, చదువుకుంటావా?"

"సదుకుంటావా? యీసారి అయిసా పయిసా తేలాల్సిందే."

"అయితే నీకు చదువు రావాల్సిందే."

"ఓయ్ నీమడ్చి దొంగల్దోలా! యిన్నాలు ఎటనో బోయిందంటే పానం, యిగనేందీ!"

"కనకయ్యగారింటో జీతానికున్నావటగా?"

"మాలచ్చుమ్మగారు కొట్టిందండీ యియ్యాలా."

"ఎందుకూ?"

"కాత్తెసాటుగా వుంటుందనీ, భోసానంకాడ ఆల్లబ్బాయి పుత్తకంలో బొమ్మలు సూస్కుంటా కూకుంటేనీ, కొట్టిందండీ."

"అందుకా కొట్టింది! మీ అయ్యతో చెప్పలా నువ్వూ?"

"మరి సెప్పలా? సెబుతేనీ, 'ఏడ్చావంటే యిరగబొడుత్తా' నన్నాడు. యీడ మోకాల్చిప్పమీనేసి కొట్టిందండీ. రఖతం కార్నట్టయితే వుండేది, ఏంవుండా!"

"ఆఁ!"

"రోజూ చదువు చెపుతా చదువుకో."

"కాత్తె సెప్పవయ్యా నీయిల్లు బంగారంగానూ!"

"తరవాత మెల్లిగా గుంటూరు స్కూల్లో చేర్పించేస్తా."

"అదిగదీ, మా జేజి లెగిసాదుద్ది! మరి అయ్య చంగతి ఎటనబ్బా, మాటకు ముంగల పొడుత్తా నంటాడూ?"

"నే నున్నాలే."

"ఆఁ! యిహి యిహి యిహి-" ఒక్కసారిగా కొండాయికి రెక్కలొచ్చి ఎగిరి కొండ సిగరాన వాల్నట్టయింది.